# న్యూసెన్స్

-జి.మేరి కృపాబాయి

"ఎక్స్‌క్యూజ్‌మీ సర్!"

"ఆఁ ఏమిటి చెప్పు. ఏం కావాలి? ఎవరు నువ్వు?" ఆఫీసుకు వెళ్లబోతూ విసుగ్గా అడిగాడు చిదంబరం.

"మీకు న్యూస్ పేపర్ వస్తుందా?"

"ఆఁ. వస్తుంది. నెలనెలా ఠంచన్‌గా పేపర్ బిల్లు కడుతుంటే రాక ఏం చేస్తుంది? లక్షణంగా వస్తోంది" అన్నాడు చిదంబరం, షూ లేస్ కట్టుకుంటూ.

"ఏ పేపర్ వస్తోంది సార్?" వాళ్లు వేయించుకునే పేపర్ పేరు చెప్పాడు చిదంబరం.

"సార్! ఆ పేపర్‌కంటే మా పేపర్‌లో ఎన్నో ప్లస్ పాయింట్స్ ఉన్నాయి సార్! ఒక్క పది నిమిషాలు మీరు నాకోసం కేటాయిస్తే మా పేపర్ ప్రత్యేక లక్షణాలను మీకు వివరిస్తాను" బ్రతిమాలాడు పేపర్ బాయ్.

"అసలే ఆఫీసుకు టైమ్ అయిపోయిందని టెన్షన్‌తో చస్తున్నాను. ఇప్పుడు నువ్వు చెప్పే సోది నేను వినలేను" అన్నాడు చిదంబరం.

"సోది కాదు సార్! మా న్యూస్ పేపర్ ప్రత్యేక లక్షణాలు" బ్రతిమాలాడు పేపర్ బాయ్.

"సరే చెప్పు!" అన్నాడు చిదంబరం అక్కడే ఉన్న కుర్చీలో చతికిలబడుతూ.

"మేడమ్‌గారిని కూడా పిలిస్తే బావుంటుందేమో సార్!" అన్నాడు బాయ్.

"మేడమ్‌గారు టీ.వి సీరియల్ చూస్తున్నారు. ఇప్పుడు పిలిస్తే రారు. కాదు...కాదు..ఇప్పుడు పిలిస్తే ఆవిడకు వినబడదు..." అన్నాడు చిదంబరం అసలు రహస్యం చెబుతూ.

"ప్లీజ్ సార్!"

"సరే పిలుస్తాలే!" అంటూ చిందబరం స్వయంగా లోపలికివెళ్లి భార్య చంద్రమతిని తట్టిలేపి పిలుచుకువచ్చాడు.

ఏమిటి విషయం? అన్నట్టు చిరాగ్గా చూసింది చంద్రమతి.

"చంద్రమతీ! ఈ పేపర్ బాయ్ ఏదో న్యూస్ పేపర్ గురించి చెబుతాడట!" అన్నాడు చిదంబరం.

"సరే చెప్పు!" అంటూ ఆ పేపర్‌బాయ్‌వైపు విసుగ్గా చూసింది చంద్రమతి.

పేపర్ బాయ్ తమ పేపర్ వివరాలు చెప్పడం ప్రారంభించాడు.

"సార్! మా పేపర్‌లో గృహిణులకు కావలసిన అన్ని విషయాలూ ఉంటాయి. విద్యార్థులకు కావలసిన సమాచారం లభ్యమవుతుంది. ఇంకా వృద్ధులకు కావలసిన ఆధ్యాత్మిక విషయాలూ వుంటాయి. ఇంకా చాలా విశేషాలుంటాయి సార్..." అంటూ పది నిమిషాలలో ఆ పేపర్ ప్రత్యేకతలన్నీ వివరించాడు బాయ్.

చిదంబరానికి ఆ పేపర్ బాగానే ఉంటుందనిపించింది. చంద్రమతి కూడా సరేనంది.

"ప్రస్తుతం ఒక న్యూస్ పేపర్ వేయించుకుంటున్నాము. దానిని మానేస్తే వాళ్లు బాధపడతారు. కాబట్టి దానిని కూడా కంటిన్యూ చేస్తాము. నువ్వు కూడా నీ పేపర్ రేపటినుండి వేసెయ్యి! ఫర్వాలేదు" అన్నాడు చిదంబరం.

"రెండు పేపర్లు ఎందుకండీ! అసలు ఒక్క పేపర్ చదవడానికే తీరికలేదు" అంది చంద్రమతి.

"ఒక పేపర్ అల్మారాల్లో వేసుకోవడానికీ గట్రా పనికి వస్తుందిలే" అంటూ సమర్థించాడు చిదంబరం.

★★★

ఆ మరుసటిరోజు మరో పేపర్ బాయ్ వచ్చాడు చిదంబరం ఇంటికి.

"సార్! మీకు ఏ న్యూస్ పేపర్ వస్తుంది!" తన ధోరణిలో ప్రశ్నించాడు ఆ అబ్బాయి.

"మాకు రెండు న్యూస్ పేపర్లు వస్తున్నాయి. ఇక ఏ న్యూస్ పేపరూ అక్కర్లేదు" ఖచ్చితంగా చెప్పాడు చిదంబరం.

"అలాకాదు సార్! మా పేపర్ చాలా బావుంటుంది. కలర్ ఫుల్‌గా ఉంటుంది. రేటు రూపాయి మాత్రమే. ఒకసారి ఈ శాంపిల్ పేపర్ చూడండి" అంటూ పేపర్ చిదంబరం చేతిలో పెట్టాడు పేపర్ బాయ్.

ఆ పేపర్‌ని రెండు నిమిషాలు పరిశీలించాడు చిదంబరం.

పేపర్ బాగా ఎట్రాక్షన్‌గా ఉన్నట్లు గ్రహించాడు.

పేపర్ వెనుకకు తిప్పి చూసాడు. సినిమా ఫీచర్స్ చాలా బావున్నాయి. ఇంతలో చిదంబరం భార్య చంద్రమతికూడా భర్త దగ్గరకు వచ్చింది.

"చంద్రమతీ! ఈ న్యూస్ పేపర్ చూసావా? కారు చవక! రేటు ఒక్క రూపాయి! పైగా చాలా ఆకర్షణీయంగా ఉంది" అన్నాడు చిదంబరం.

"అయితే ఈ పేపర్ కూడా వేయించుకుందామండీ! చిత్తు కాగితాలవాడికి అమ్మినా ఆ రేటు వచ్చేస్తుంది" అంది చంద్రమతి ఆనందంగా.

పేపర్ బాయ్‌కి ఓ.కె. చెప్పేసాడు చిదంబరం.

ఆ తరువాతిరోజు ఫస్టు తారీఖు. ఆ రోజు నుండి చిదంబరానికి మూడు న్యూస్ పేపర్లు రావలసిఉంది.

ఫస్టు తారీఖు తెల్లవారు ఝామున ఏదో నాటుబాంబు పేలినట్లు పెద్దగా శబ్దం అయ్యింది. మత్తు నిద్రలో ఉన్న చిదంబరం, చంద్రమతి, ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచారు.

"ఎక్కడో బాంబు పేలిందండీ! అయినా ఈ సమయంలో బాంబు పేలడమేమిటి?" ఏదో అనుమానంగా అంది చంద్రమతి.

"ఏమిటో చూద్దాం పద!" అంటూ చిదంబరం నెమ్మదిగా తలుపు తీసుకుని బయటికి

వెళ్ళాడు. వెంటనే అతనికి అర్థమైంది.

అసలు విషయమేండే మొదటి పేపర్‌బాయ్ న్యూస్ పేపర్‌ని పెసరట్టులా చుట్టి రోడ్డుమీద నుండి వరండాలోకి విసిరికొట్టాడు. ఆ వేగానికి కిటికీ అద్దం ముక్కలై బాంబుపేలిన శబ్దం వచ్చింది.

రెండు నిమిషాలలో విషయం చంద్రమతికి కూడా అర్థమైంది.

“చూసారా! ఈ పేపర్‌బాయ్ ఎంతపని చేసాడో, బంగారంలాటి కిటికీ బద్దలైపోయింది. మళ్లీ ఆ అద్దం కొనాలంటే రెండువేలు అవుతుంది” బాధగా అంది చంద్రమతి.

పెసరట్టులా చుట్టి ఉన్న న్యూస్‌పేపర్‌ని లోనికి తీసుకుని, చేసేదిలేక, ఇంటిలోనికి నడిచాడు చిదంబరం.

మరికాసేపటికి మరొక న్యూస్ పేపర్ రాకెట్‌లా దూసుకువచ్చి, ఇంటిముందు ఈశాన్యం వైపు ఉన్న బావిలో పడింది.

ఇంటిలోనుండి చిదంబరం బయటికి వచ్చేలోగానే ఆ పేపర్‌బాయ్ తారాజువ్వలా కనుమరుగయ్యాడు.

పేపర్ బాయ్ విన్యాసాలు చూసి నివ్వెరపోయాడు చిదంబరం.

పేపర్ బిల్లుక వచ్చినప్పుడు పీక్ల సంగతి తేల్చాలి అనుకుంటూ బావిలోని పేపర్‌ని బకెట్‌తో పైకి తీసాడు చిదంబరం.

ఆ పనికి అరగంట పట్టింది చిదంబరానికి.



తడిసి ముద్దయి, ముక్కలైన ఆ పేపర్‌ని చూసిన చిదంబరానికి చలి మిడి సుద్ద గుర్తుకు వచ్చింది.

ఆ తరువాత కాసేపటికి చంద్రమతి వాకిట్లో ముగ్గువేస్తూ గట్టిగా అరిచి కిందపడిపోయింది. ఏదో రాకెట్ శకలం తనపై పడిపోయిందని చంద్రమతి భావించి ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయింది. చంద్రమతి అరుపుకి చిదంబరం ఇంటిలోనుండి పరిగెత్తుకొచ్చాడు.

క్షణంలో అతనికి విషయం అర్థమైంది.

మూడో పేపర్ బాయ్ విసిరిన న్యూస్ పేపర్ చంద్రమతి మొహానికి తగిలి, ఆమె స్పృహ తప్పినట్లు గ్రహించాడు చిదంబరం. వెంటనే ఆమెకు సపర్యలు చేసి స్పృహ తెప్పించాడు.

స్పృహరాగానే చంద్రమతి పేపర్ బాయిస్‌పై విరుచుకుపడింది. నోటికొచ్చినట్లు తిట్టి పోసింది.

"ఏమండీ! రేపు పేపర్ బాయిస్ ముగ్గురికీ మీరు మూడుగంటలు క్లాస్ తియ్యాలి. పేపర్ రోడ్డుమీదనుండి విసరకూడదు. మొహానవేసి కొట్టకూడదు. నూతిలోనూ,నీటిలోనూ వెయ్యకూడదు..." అంటూ చాలా కండిషన్స్ చెప్పింది చంద్రమతి.

చంద్రమతి చెప్పిన కండిషన్స్ అన్నీ చిదంబరం ఒక పేపర్‌పై రాసుకున్నాడు.

ఆ మరుసటి రోజు ముగ్గురు పేపర్‌బాయిస్‌ను పిలిచి క్లాస్ తీసాడు చిదంబరం.

"అలాగే సార్!" అంటూ ఉడాయించారు ముగ్గురు పేపర్ బాయ్స్.

మరికాసేపటికి మరొక పేపర్‌బాయ్ వచ్చాడు చిదంబరం దగ్గరకు. అతను గులాబీరంగు యూనిఫాంలో ఉన్నాడు.

"సార్! మా న్యూస్ పేపర్ పేరు గులాబీ! మా న్యూస్ పేపర్‌లో వంద ప్రత్యేకతలున్నాయి. మీకు ఇష్టమైతే రేపటినుండి మీకు పేపర్ వస్తుంది" అన్నాడు అతను.

ఒళ్లు మండిపోయింది చిదంబరానికి.

"ఇప్పటికే మా ఇంట్లో న్యూస్ పేపర్లు ఎక్కువైపోయాయి. ఇంట్లో ఎక్కడ చూసినా న్యూస్ పేపర్లే. మొన్న వీచిన ఈదురుగాలికి న్యూస్ పేపర్లన్నీ ఇల్లంతా గాలిపటాల్లా ఎగిరాయి. వాటిని సర్దడానికి ఒక పూట పట్టింది" చిరాగ్గా అన్నాడు చిదంబరం.

"సార్! ప్లీజ్ సార్!" అభ్యర్థించాడు అతను.

"నాలుగో న్యూస్ పేపర్ వద్దుగాక వద్దు!" ఖచ్చితంగా చెప్పాడు చిదంబరం.

"సార్! మా న్యూస్ పేపర్ ఆరు నెలలు ఉచితంగా వేస్తాము సార్!" ఆనందంగా అన్నాడు ఆ బాయ్.

"ఆఁ... అలాగా!!" సంతోషాన్ని వ్యక్తం చేసాడు చిదంబరం.

"అవును సార్!"

"అయితే రేపటినుండి ఆ న్యూస్ పేపర్ వేసెయ్యి" గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు చిదంబరం.

***

మరోవారం తర్వాత చిదంబరం ఆఫీసుకు వెళ్ళి తన సీట్లో కూర్చోగానే, ఐదుగురు కొలీగ్స్ చిదంబరం దగ్గరకు వడివడిగా వచ్చారు.

ఏమిటన్నట్లుగా చూసాడు చిదంబరం.

"చిదంబరంగారూ! మీరు నాలుగు న్యూస్ పేపర్లు వేయించుకుంటారట కదా! ఆరు నెలలక్రితం ప్రగతి న్యూస్ పేపర్లో చింతకాయ పచ్చడి ఎలా పెట్టాలో ఉందట. కాస్త తెచ్చిపెట్టండి" అంది రీటా వయ్యారంగా.

"చిదంబరంగారూ! మొన్నటి గులాబి పేపర్లో 'గులేబకావళి కథ' సినిమా పాట ఉందంట కాస్త తెచ్చిపెట్టండి" అన్నాడు గోపాలరావు.


"చిదంబరంగారూ! పోయిన సంవత్సరం జనవరి నెల 'కాగడా' పేపర్లో క్రికెట్ ఎలా చూడాలి? అనే ఆర్టికల్ ఉందట. కాస్త తెచ్చి పెట్టండి" అన్నాడు హనుమంతరావు.

"చిదంబరంగారూ! పదిరోజుల క్రితం ఏదో న్యూస్ పేపర్లో ఏవో ఉద్యోగాలు పడ్డాయట. కాస్త తెచ్చి పెట్టండి" అన్నాడు రామారావు.

"చిదంబరంగారూ! మరో వారం రోజుల్లో డి.యస్సీ. నోటిఫికేషన్ పడబోతుందట. కాస్త ఏ పేపర్లో వేస్తే ఆ పేపర్ తెచ్చి ఇవ్వండి" అన్నాడు గుర్నాథం.

వెర్రి మొహం వేసుకుని అలానే చూస్తుండిపోయాడు చిదంబరం.

★



## లక్కీ షాహిద్!

కరీనాకపూర్ నుంచి ఏ ముహూర్తాన దూరమయ్యాడో గానీ షాహిద్ కపూర్ అన్నీ కలిసొస్తున్నాయి అంటున్నారు బాలీవుడ్ సినీజనాలు. అటు సినిమా ఆఫర్లతో తెగ బిజీగా వుంటుంటే, ఇటు యాడ్స్ కూడా వచ్చిపడుతున్నాయిట. తాజాగా షాహిద్ 'వి.ఐ.పి లగేజ్' వారికి యాడ్స్ చేస్తున్నాడట. ఇందుకుగాను అతనికి ముడుతున్న మొత్తం 7 కోట్లట. ఓ సినిమాలో నటించినా కూడా అంత మొత్తం రాదు. సినిమాలకంటే యాడ్సే గిట్టుబాటుగా వున్నట్టుంది తారలకి.

